సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 12 । మార్చి । 2023





## ఉరుసు ఉత్సవం

కశింకోట మండలం బయ్యవరంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుసు ఉత్సవం వైభవంగా జరిగింది. 8లో



## వాహనాల విస్తృత తనిఖీ

విశాఖ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నగరంలో ఆరు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేస్తున్నారు.



## శ్రీనృసింహ హోమం

సింహాచలం: సింహగిరిపై శనివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. స్వాతి నక్షత్రం రోజున హోమం నిర్వహిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### ఆంగ్ల ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు

నర్సీపట్నం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆంగ్ల ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. బలిఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం ఉదయం 8 గంటలకు డిప్యూటీ డీఈవో ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహించాల్సిన ఉపాధ్యాయిని విధులకు హాజరు కాలేదు. దీంతో ఆయన చర్య తీసుకున్నారు. డిప్యూటీ డీఈవో విలేకరులతో మాట్లాడుతూ.. టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జేసీ కల్పనాకుమారి 'కృషి' పేరుతో ప్రత్యేక ప్రోగ్రాం రూపొందించి, 50 రోజుల ప్రణాళిక ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రకారం ఉదయం 8 నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 3.30 గంటల నుంచి 5.15 వరకు చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలన్నారు. ఏ రోజు ఏ టీచర్ తరగతులు తీసుకోవాలన్నది టైంటేబుల్ వేశామన్నారు. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇంగ్లిష్ టీచర్ కుమారి విధులకు రాకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు డిప్యూటీ డీఈవో తెలిపారు.

### నేవీ ప్రహరీ పనుల అడ్డగింత



డీఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామస్తులు

రాంబిల్లి: నేవీ ప్రహరీ గోడ పనులను శనివారం పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. కొండను ఆనుకొని ప్రహరీ నిర్మిస్తే తమకు ఇబ్బందులు తప్పవని ఆ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు యలమంచిలి కనకారావు, బద్ది నారాయణరావు పేర్కొన్నారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు అవకాశాలుండవని, పలు ప్రభుత్వ భవనాలు, ఇళ్లకు వెళ్లే అవకాశాలుండవని ఈ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక కొండప్రాంతంలో పశువులు, మేకలు, గొర్రెలకు మేతకు వెళ్లే అవకాశాలుండవని వాపోయారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు సీఐ గఫూర్, ఎస్ఐ దీనబంధుతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని సూచించారు.

### గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నేరుగా ఇవ్వవచ్చునని.. లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### పెళ్లి పందిట్లో ఎన్నికల ప్రచారం



ఎస్.రాయవరం: వెంకటాపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరికొద్ది సేపట్లో పెళ్లి చేసుకుని నూతన జీవితం ప్రారంభించబోయే వధూవరులను కలిసి ఆశీర్వదించిన బాబూరావు.. వారిని ఓటు అభ్యర్థించారు.

# పట్టభద్రుల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 37 మంది అభ్యర్థులు.. 2,89,214 మంది ఓటర్లు
- రేపు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 331 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- 2,038 మంది పోలింగ్ సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ
- 840 మంది పోలీసుల భద్రతలో పోలింగ్ నిర్వహణ
- మన్యం, అల్లూరి జిల్లాల పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్
- 'సాక్షి'తో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు అధికారులతో పహారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న జరిగే పోలింగ్ కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని 331 పోలింగ్ స్టేషన్లకు సామగ్రితో పాటు, ఎన్నికల సిబ్బందిని పంపించినట్లు 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

**సమస్యాత్మక ప్రాంతాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలూ చేపట్టాం. అభ్యర్థులు పోలింగ్ సమయంలో ఏం చేయకూడదనే అంశంపై శనివారం సాయంత్రం చివరి సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు వివరించాం. మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 34 ఆక్సిలరీ స్టేషన్లతో కలిసి మొత్తం 331 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పార్వతీపురం మన్యం పరిధిలో 12, అల్లూరి జిల్లాలో 15 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, పారామిలటరీ దళాలను వినియోగిస్తున్నాం. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశాం.

**ఏ పోలింగ్ స్టేషన్.. సిబ్బందికి తెలీదు**

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 2,038 మంది సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ తరగతులు నిర్వహించాం. పోలింగ్ సమయంలో ఏ విధంగా విధులు నిర్వర్తించాలి, బ్యాలెట్ బాక్సులను ఎలా భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌కి తీసుకురావాలి. కౌంటింగ్ సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శిక్షణ పూర్తయింది. సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించే విషయమై రెండు సార్లు ర్యాండమైజేషన్ తయారు చేసి గ్రూప్‌లుగా విభజించాం. ఏ జిల్లా పరిధిలో పని చేస్తారనేది తెలియజేశాం. కానీ ఎవరు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించాలన్నది ఆదివారం తెలియజేసిన వెంటనే విధులకు బయలుదేరనున్నారు. ప్రతి జిల్లాలోనూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఎంత ఆలస్యమైనా అదే రోజు బయలుదేరి విశాఖలో ఏర్పాటు చేసిన మెయిన్ స్ట్రాంగ్‌రూమ్ స్వర్ణభారతి స్టేడియంకి భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులు తీసుకురావాలి. ఇక్కడ ప్రతి జిల్లాకో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశాం. వాటిలో బ్యాలెట్ బాక్సులను భద్రపరచాలి.

**బ్యాలెట్ బాక్సులు, పత్రాల పంపిణీ ఇలా..**

| జిల్లా | బ్యాలెట్ బాక్సులు | బ్యాలెట్ పత్రాలు |
|---|---|---|
| శ్రీకాకుళం | 292 | 54,200 |
| విజయనగరం | 229 | 60,600 |
| పార్వతీపురం మన్యం | 62 | 19,300 |
| విశాఖపట్నం | 18 | 12,000 |
| అల్లూరి సీతారామరాజు | 358 | 1,09,400 |
| అనకాపల్లి | 160 | 44,200 |
| రిజర్వ్ | -- | 5,325 |
| మొత్తం | 1119 | 3,05,025 |

**అన్నీ పెద్ద బ్యాలెట్ బాక్సులే..**

ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 1, 119 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నాం. అన్నీ పెద్ద బాక్సులు మాత్రమే వాడుతున్నాం. 200 నుంచి 600 మధ్యలో ఓటర్లున్న స్టేషన్లలో రెండు బాక్సులు, 600 నుంచి 1100 మధ్యలో ఉంటే మూడు బాక్సులు, 1100 దాటిన పోలింగ్ స్టేషన్లలో 4 బాక్సులు వినియోగిస్తున్నాం. అన్ని బ్యాలెట్ బాక్సులకు ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేశాం.



స్వర్ణభారతి స్టేడియంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

**జిల్లాల వారీగా ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు**

| జిల్లా | పోలింగ్ స్టేషన్లు | పురుష ఓటర్లు | మహిళా ఓటర్లు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 59 | 36,411 | 15,840 | 05 | 52,256 |
| విజయనగరం | 72 | 38,625 | 19868 | 09 | 58502 |
| పార్వతీపురం మన్యం | 24 | 12,516 | 6,002 | 02 | 18,520 |
| అల్లూరి సీతారామరాజు | 15 | 7861 | 3661 | 03 | 11,525 |
| విశాఖపట్నం | 112 | 58,364 | 47320 | 13 | 1,05,697 |
| అనకాపల్లి | 49 | 28,370 | 14,338 | 06 | 42,714 |
| మొత్తం | 331 | 1,82,147 | 1,07,029 | 38 | 2,89,214 |

**5,325 బ్యాలెట్ పత్రాల్లో ముద్రణ లోపాలు**

బ్యాలెట్ పేపర్లు, రిజర్వ్ సంఖ్యతో కలిపి ఇప్పటికే పంపిణీ పూర్తి చేశాం. కర్నూలులో ప్రింట్ పూర్తయి వచ్చిన ప్రతి బ్యాలెట్ పత్రాన్ని పరిశీలించాం. ఇందులో 5,325 డిఫెక్టివ్ బ్యాలెట్ పత్రాలు వచ్చాయి. అంటే ఈ బ్యాలెట్ పత్రాల్లో పేర్లు ఉన్నాయి కానీ.. సీరియల్ నంబర్లు లేవు. 1 నుంచి 31 వరకు సీరియల్ నంబర్లు ముద్రించలేదు. వీటని పక్కన పెట్టి ఈ అంశంపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశాం. వాటిని ఏం చేయాలన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ బ్యాలెట్ పత్రాలు తీసేసినప్పటికీ.. సరిపడా ఉన్నాయి. ఫారం–12 ప్రకారం పోస్టల్ బ్యాలెట్ కోసం 1,214 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 748 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు పంపించాం. ఆదివారం కూడా మరికొందరికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు 95.91 శాతం పూర్తయింది. ఆబ్సెంట్, డూప్లికేట్, షిఫ్టింగ్ మొదలైన ఓటర్ల జాబితాలను ఆయా పోలింగ్ స్టేషన్ల ప్రిసైడింగ్ అధికారులకు పంపిస్తాం.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

ప్రతి జిల్లాలోనూ బందోబస్తు పటిష్టంగా నిర్వహించాం. ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. వాటికి సంబంధించిన నివేదికలు సమర్పించాం. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా పోలింగ్ నిర్వహించనున్నాం. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేశాం.

### 48 గంటలు డ్రై డే

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే సాయంత్రం 4 గంటల వరకూ 6 జిల్లాల్లోనూ డ్రై డే నిర్వహిస్తున్నాం. ఈ 48 గంటల పాటు ఎక్కడా మద్యం అమ్మకాలు చేపట్టకూడదు. పోలింగ్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు, కార్యాలయాలకు 12, 13 తేదీల్లో సెలవులుగా ప్రకటించాం. కౌంటింగ్ సమయంలో లోకల్ హాలిడేలు కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ఓటు వేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను వినియోగించుకోవచ్చు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారిలో ఎవరికి ఓటు హక్కు ఉందో వారి షిఫ్ట్‌లో మార్పులు చేయడం, లేదా ఓటు వేయడానికి అనుమతి ఇవ్వడం చేయాలని ఆదేశించాం.

- 6 జిల్లాల పరిధిలో 75 రూట్లలో పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 66 బస్సులు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం జిల్లా పరిధిలో 383 మంది, విజయనగరంలో 455, మన్యంలో 145, అల్లూరిలో 94, విశాఖపట్నంలో 657, అనకాపల్లిలో 304 మంది చొప్పున మొత్తం 2,038 మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు.
- ఆరు జిల్లాల పరిధిలో 393 పీవోలు, 394 మంది ఏపీవోలు, 848 ఓపీవోలు, 403 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు.
- శ్రీకాకుళంలో 899 మంది, విజయనగరంలో 1063, మన్యంలో 396, అల్లూరిలో 230 మంది, విశాఖపట్నంలో 1142, అనకాపల్లిలో 691 మంది చొప్పున మొత్తం 4,420 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. వీరితో పాటు 8 పీఎల్‌టీలు, 10 పార్టీలు, ఒక ఏపీఎస్‌పీ బృందం, 4 సెక్షన్ ఎస్‌ఏపీ బృందాలు విధులు నిర్వర్తించనున్నాయి.
- 2017 ఎన్నికల్లో 1,55,930 మంది ఓటర్లుండగా 1,08,857 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 69.78 శాతం పోలింగ్ నమోదైంది.

### డిగ్రీ సర్టిఫికెట్ చూపించి ఓటు వేయొచ్చు

గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎన్నికల కమిషన్‌కు సంబంధించి ఎపిక్ కార్డు/ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాన్ కార్డు/పాస్‌పోర్టు చూపించి ఓటు వేసుకోవచ్చు. కేవలం ఎపిక్ కార్డు ఉండాలన్న నిబంధనలేమీ లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులు కూడా తమ సర్వీస్ ఐడెంటిటీ కార్డు చూపించి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ అఫీషియల్ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇవేమీ లేకపోయినా డిగ్రీ సర్టిఫికెట్ తీసుకొచ్చి చూపించి కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. దివ్యాంగులు కూడా ఆ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 13వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్ లోపలికి వచ్చే వారికి మాత్రమే ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తాం.

## బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య ఓటు తప్పనిసరి

- లేదంటే చెల్లని ఓటుగా పరిగణిస్తాం
- అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగే 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ స్వభావంతో కూడిన సందేశాలు పంపడం, ఫోన్ కాల్స్ ద్వారా ప్రచారం నిర్వహించొద్దని రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం పోలింగ్, ఎన్నికల నియమావళిపై బరిలో ఉన్న 37 మంది అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. బల్క్ మేసేజ్‌ల పేరుతో ఉల్లంఘన జరిగితే ఎన్నికల నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఓటింగ్ వేసే విధానాన్ని అభ్యర్థులకు వివరించారు. బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య సంఖ్య ఒకటి తప్పనిసరిగా వేయాలని, లేదంటే ఆ ఓటు చెల్లనదిగా పరిగణిస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన నేరేడు రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే నంబర్స్ వేయాలన్నారు. అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో 12వ తేదీ సాయంత్రం నుంచి ఫారం–10 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల కోసం ఫారం–18 ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### సజావుగా పోలింగ్

- సమన్వయంతో వ్యవహరించాలి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సాక్షి, అనకాపల్లి: ఈనెల 13వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. జిల్లా అధికారులతో శనివారం జరిపిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జోనల్ అధికారులు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారి వారి జోన్లలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా పాటించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ బూత్‌కు చేరేలా పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లను సమన్వయపర్చాలన్నారు. రిటర్నింగ్ అధికారికి పోలింగ్ పర్సంటేజీను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పోలీసు అధికారులు పోలింగ్ జరిగే సమయంలో బూత్‌ల లోపలికి వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే పోలింగ్ అధికారి సూచనల మేరకు మాత్రమే పోలీస్ అధికారులు పోలింగ్ బూత్‌లో స్పందించాలని స్పష్టం చేశారు.

### ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఎస్పీ గౌతమి సాలి



సాక్షి, అనకాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఎస్పీ గౌతమి సాలి అన్నారు. జిల్లా పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 691 పోలీస్ సిబ్బందితో పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. 10 రూట్ మొబైల్స్ టీంలు, 24 క్విక్ రెస్పాన్స్ టీంలు, 12 స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు, 2 రిజర్వ్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులు, గుంపులుగా ఉండరాదన్నారు. ఏజెంట్లు, ఓటర్లు ఓటింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకొని రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# అనకాపల్లిలో గ్లకోమా ఆపరేషన్లు

- అందుబాటులోకి వచ్చిన సదుపాయం
- శస్త్రచికిత్స కోసం విశాఖ వెళ్లాల్సిన పనిలేదు



డాక్టర్ రమణకుమార్

నక్కపల్లి: గ్లకోమా ఒక భయంకరమైన కంటి సమస్య. నిశ్శబ్దంగా చూపును కబళిస్తుంది. జనసామాన్యం నీటి కాసులుగా వ్యవహరించే ఈ నేత్ర వ్యాధి కళ్లకు సోకితే క్రమక్రమంగా చూపు పోతుంది. శస్త్రచికిత్స ఒక్కటే దీనికి చికిత్స. ఇంతవరకు గ్లకోమా ఆపరేషన్ ఒక్క విశాఖలోని ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో, నగరంలోని మరికొన్ని ప్రైవేట్ ఆస్పత్రులలో మాత్రమే అందుబాటులో ఉండేది. నేత్ర పరీక్షలు స్థానికంగా చేసి, సమస్యను గుర్తించినా శస్త్రచికిత్స కోసం విశాఖ వెళ్లాల్సిందే. ఇప్పుడు ఆ సదుపాయం అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రమణకుమార్ నేత్ర శస్త్రచికిత్స నిపుణుడు కావడంతో ఇప్పుడు అనకాపల్లిలో కూడా ఆపరేషన్‌కు వీలు చిక్కింది.

**నేటి నుంచి అవగాహన వారోత్సవాలు**

గ్లకోమాపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈనెల 12 నుంచి వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలను వివరిస్తూ, వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామని డాక్టర్ రమణకుమార్ 'సాక్షి'కి చెప్పారు. కళ్లు ఒత్తిడికి లోనుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. గ్లకోమా పరీక్షలు ప్రతి ఏరియా ఆస్పత్రిలో చేస్తారని, ముందుగా గుర్తిస్తే, చూపును నష్టపోకుండా జాగ్రత్త పడవచ్చని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో గ్లకోమా ఆపరేషన్‌ను చేర్చిందని, వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో నిర్వహించే పరీక్షల్లో గ్లకోమా నిర్ధారణ అయితే ప్రభుత్వమే ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తుందన్నారు. కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే వారసత్వంగా వస్తుందని డాక్టర్ రమణకుమార్ చెప్పారు. 40 ఏళ్లు పైబడిన వారికి, మధుమేహవ్యాధి ఉన్న వారికి, దీర్ఘకాలంగా స్టెరాయిడ్స్ వాడుతున్న వారికి, కంటి గాయాలు కలిగిన వారికి గ్లకోమా సోకే అవకాశం ఉందన్నారు.

# తోడపెద్దు కన్నుమూత



అంతిమయాత్రలో పాల్గొన్న స్థానిక ప్రజలు (ఇన్‌సెట్ ) మృతి చెందిన తోడపెద్దు

**అంతిమయాత్ర నిర్వహించిన స్థానికులు**

మాకవరపాలెం: నందీశ్వరుడిగా.. సింహాద్రి అప్పన్నగా కొలిచే తోడపెద్దు అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామస్తులు ఘనంగా అంతిమయాత్ర నిర్వహించి, అంత్యక్రియలు చేశారు. గిడుతూరు గ్రామంలో పాకలపాటి బంగార్రాజు కుటుంబం వారు గత 80 ఏళ్లగా గ్రామంలో ఉన్న తోడపెద్దుల సంరక్షణ చూస్తున్నారు. 20 ఏళ్లుగా ఇక్కడ ఉన్న తోడపెద్దు అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మరణించింది. రాత్రంతా తోడపెద్దు వద్ద గ్రామస్థులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. శనివారం ఉదయం ఎడ్ల బండిపై ఉంచి గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగించారు. ఐదు గంటల పాటు అంతిమ యాత్ర సాగింది. అనంతరం అంతిమ సంస్కారాలు పూర్తి చేసి, అన్నసమారాధన నిర్వహించారు.

# శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- బీసీ గురుకుల పాఠశాల కార్యదర్శి కృష్ణమోహన్
- పది విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన

నర్సీపట్నం: పదిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా విద్యా బోధన సాగుతుందని మహాత్మ జ్యోతిబాఫూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర సెక్రెటరీ ఎ.కృష్ణమోహన్ పేర్కొన్నారు. నర్సీపట్నంలోని బీసీ గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఇటీవల విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్లను క్షుణ్ణంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. పరీక్షకు సమయం దగ్గర పడుతున్నందున స్పెషల్ క్లాస్‌లు తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులను ఆదేశించారు. బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేట్‌లో 102 గురుకుల విద్యా లయాల్లో 38,500 విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారని అన్నారు. వీరిలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు 5,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 83 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ఈ ఏడాది మెరుగైన ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. పక్కా భవనాల నిర్మాణానికి 35 విద్యాలయాలకు స్థల సేకరణ చేశామన్నారు. ప్రస్తుతం వీటిలో స్టేట్‌లో ఐదు చోట్ల పక్కా భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క భవానికి ప్రభుత్వం రూ.35 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. మొదటి విడత నాడు–నేడు పథకంలో రూ.18 కోట్లతో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. రెండవ విడతలో మరికొన్ని పాఠశాలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. బీసీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఈ ఏడాది లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పి, ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.


విద్యార్థుల పఠన సామర్థ్యం పరీక్షిస్తున్న కృష్ణమోహన్



# ఘనంగా ఔలియా ఉరుసు ఉత్సవం

- ఔలియా దర్గాను దర్శించుకున్న హిందూ, ముస్లింలు
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వేడుక


ఔలియా దర్గాను దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి దంపతులు


విద్యుద్దీపాలంకరణలో దర్గా

కశింకోట: బయ్యవరంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ అన్సర్ మద్నీ ఔలియా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు హిందువులు దర్గాను దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు టాటానగర్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి కూడా ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగుల చాదర్లు పట్టుకుని గ్రూపులుగా వచ్చి ఔలియా సమాధిపై కప్పి దర్శించుకున్నారు. చందనం పూశారు. తీపి బూందీ, ఖర్జూరం తదితరాల సమర్పించారు. పురుషులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు దర్గాను దర్శించుకుని ఔలియా సమాధి వద్ద సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ హకీం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. రంగుల రాట్నాలు, ఆకాశ చక్రంపై పెద్దలు, చిన్నారులు తిరుగాడారు. అలంకరణ వస్తువులు, తినుబండారాల అమ్మకాలు సాగాయి. ఔలియాను ప్రార్థిస్తూ మతపెద్దలు ప్రసంగాలు చేశారు. దర్గాను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

# అకేషియా చెట్లు దగ్ధం


కాలిపోతున్న అకేషియా వనం

రాంబిల్లి : నేవీ పునరావాసకాలనీ నుంచి అప్పన్నపాలెం వరకు గల కొండప్రాంతంలో అకేషియా చెట్లకు నిప్పంటుకుంది. సుమారు 80 హెక్టార్ల అటవీ ప్రాంతంలో శనివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. యలమంచిలి అగ్నిమాపక శాఖ వాహనంతో సహా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే మంటల ఉధృతి అధికంగా ఉండడంతో ఆర్పే పరిస్థితి లేక వెనుదిరిగారు. మంటలు ఆర్పేందుకు తగిన నీరు అందుబాటులో లేదు. హుద్‌హుద్ తుపాను సమయంలో ఈ వనం బాగా దెబ్బతింది. అక్కడక్కడ మిగిలిన చెట్లకు ప్రస్తుతం నిప్పంటుకుంది. ఆకులు ఎక్కువగా రాలి ఎండిపోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. అయితే నిప్పు ఎలా అంటుకున్నదీ తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు.

# స్కూటీతో పరారవుతూ.. అనంత లోకాలకు

- పురుషోత్తపురం వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం
- మృతి చెందిన యువకుడిపై పదికి పైగా చోరీ కేసులు


ప్రమాదంలో మృతి చెందిన మున్నాకుమార్, (ఇన్‌సెట్) మున్నాకుమార్ (ఫైల్)


ప్రమాదానికి కారణమైన స్కూటీ

యలమంచిలి : చెడు వ్యసనాలకు బానిసగా మారిన ఓ యువకుడు ద్విచక్రవాహనాలను చోరీ చేసి, వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలకు అలవాటు పడ్డాడు. ఇదే క్రమంలో మరో ద్విచక్ర వాహనంతో పరారయ్యేందుకు యత్నిస్తూ ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. రాజమండ్రి లాలాచెరువు ప్రాంతానికి చెందిన మార్బుల్ వ్యాపారి మనోజ్‌కుమార్ కుమారుడు మున్నాకుమార్ (21)పై నాలుగు జిల్లాల్లో 10కి పైగా చోరీ కేసులున్నాయి. పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను క్షణాల్లో మాయం చేయడంలో యువకుడు ఆరితేరాడు. శుక్రవారం రాత్రి ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామంలో పార్క్ చేసి ఉంచిన స్కూటీని తస్కరించిన యువకుడు పరారవుతుండగా పురుషోత్తపురం హైవే జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా మృతి చెందిన యువకుడు ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. అతడిపై 10కి పైగా పలు స్టేషన్లలో కేసులున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై సన్నిబాబు తెలిపారు. ఉన్నత కుటుంబంలో పుట్టినప్పటికీ చెడు వ్యసనాలతో చోరీలకు అలవాటు పడి రెండు పదుల వయసులోనే ప్రాణాలు కోల్పోయిన కుమారుడిని చూసి తండ్రి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. దేవుడా ఇలాంటి పరిస్థితి ఏ కుటుంబానికి రాకూడదని వారు రోదించారు.

# విత్తన గొడౌన్ల నిర్మాణ పనులు వేగవంతం


గొడౌన్ పనులను పరిశీలిస్తున్న ఏపీ విత్తన ధ్రువీకరణ సంస్థ జేడీ విశ్వనాథం

చోడవరం: ఏపీ సీడ్ గొడౌన్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ జాయింట్ డైరెక్టర్ వి.విశ్వనాథం ఆదేశించారు. గంధవరంలో సంస్థ నిర్మిస్తున్న విత్తన ఉత్పత్తి, సీడ్ స్టోరేజ్ గొడౌన్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిధులు పూర్తిగా సమకూరినందున పనులు జోరుగా చేయాలన్నారు. జిల్లా మేనేజర్ కె.నాగసాయిబాబా, ఎ.భార్గవ్, సూపర్‌వైజర్ త్రినాథరావు, గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు మొల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాలు

**అనకాపల్లిటౌన్ :** స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శనివారం పేర్కొన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరకావాలని ఆయన కోరారు.

### ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



వెదురుపర్తిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

**కశింకోట:** మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరులను గ్రామంలో ఊరేగించారు. ప్రజలు దర్శించి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయనను దుశ్శాలువాతో సత్కరించింది. ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### ఈ వ్యాన్ ఎవరిదో!



కొప్పాక బ్రిడ్జిపై నిలిచిపోయిన వ్యాన్

**అనకాపల్లి టౌన్:** గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన కొప్పాక బ్రిడ్జిపై 10 రోజులుగా మినీ వ్యాన్ నిలిచిపోయింది. వ్యాన్ ఇక్కడ నిలిచిపోవడం పట్ల గ్రామస్తుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ– అనకాపల్లి ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ఉన్న వ్యాన్ రాత్రి సమయంలో అటుగా వెళ్లే వాహనాలకు కనిపించకపోవడంతో భారీ వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు ఈ వ్యాన్‌పై దృష్టి సారించి ఈ వాహనం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| గ్రంథాలయం | రాజా |
| సీఎస్ఐ | సత్యనారాయణస్క్రీన్-1 |
| సాచి | సత్యనారాయణస్క్రీన్-2 |
| వినరోభాగ్యము విష్ణుకథ | షిర్డిసాయి |
| బలగం | పర్తిసాయి |
| వాల్తేరు వీరయ్య | వెంకటేశ్వర |
| పులి | శ్రీసత్య |
| జంతు ప్రపంచం | రామచంద్ర |

## బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,213 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,770 | 4,030 |
| మొదటి రకం | 3,490 | 3,750 |
| రెండో రకం | 3,250 | 3,510 |
| మూడో రకం | 3,050 | 3,240 |

## రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్ 5 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 377మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 427 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాలు
- 7,434 మంది పట్టభద్రులు

**అనకాపల్లిటౌన్:** నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 8 పోలింగ్‌బూత్‌లు సిద్ధమయ్యాయి. పట్టణంలో 6 పోలింగ్‌కేంద్రాలు, కశింకోట మండలంలో 2 పోలింగ్ కేంద్రాల్లో 7,434 మంది పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కేంద్రాల్లో అన్నిరకాల మౌలికసదుపాయాల కల్పనతోపాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి అధికారగణం అన్ని చర్యలు చేపట్టింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయసంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ దాడి మోహనరావు పర్యవేక్షణలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం మండలంలో ఏఎంఏఏ హైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ రూమ్‌ను శనివారం ఆర్డీవో ఎ.జి.చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధరరావులు పరిశీలించారు.



పోలింగ్‌కేంద్రం



ఏఎంఏఏ హైస్కూల్లో తహసీల్దార్ గంగాధరరావుతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

**పోలింగ్‌కేంద్రాలివే...**

కశింకోట మండల పరిషత్ ప్రైమరీ హైస్కూల్లో సౌత్ 189 పోలింగ్‌కేంద్రంలో 788 మంది ఓటర్లు, నార్త్ 190 పోలింగ్ కేంద్రంలో 670 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అనకాపల్లి పట్టణంలో గాంధీనగరం హైస్కూల్ సౌత్ 191 పోలింగ్ కేంద్రంలో 1,132 మంది, నార్త్ 192 పోలింగ్ కేంద్రంలో 860 మంది, ఉడ్‌పేట ఎలమెంటరీ పాఠశాలలో 193 పోలింగ్ కేంద్రంలో 938 మంది, జీవీఎంసీ పెదహైస్కూల్లో 194 పోలింగ్ కేంద్రంలో 1,393 మంది, గవరపాలెం చినహైస్కూల్లో నార్త్ 195 పోలింగ్ కేంద్రంలో 1000 మంది, సౌత్ 195ఎ పోలింగ్ కేంద్రంలో 653 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

# చివరి రోజు హోరెత్తిన ప్రచారం

**అనకాపల్లి రూరల్ :** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు అండగా నిలిచారు. ఈ నెల 13న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో చివరిరోజు ప్రచారాన్ని హోరెత్తించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించడం వల్ల ఉత్తరాంధ్రకు జరగనున్న మేలును వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లిసూరిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. శనివారం మండలంలోని వెంకుపాలెం,సీతానగరం, మెట్టపాలెం గ్రామాల్లో సచివాలయాలు, ప్రభుత్వ,పాఠశాలలకు వెళ్లి పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. మూడున్నరేళ్లుగా సీఎం జగన్ రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి విచక్షణతో ఓటు వేయాలని,పట్టభద్రులంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యమని ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు తమ మద్దతు తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు వెంట వైస్ ఎంపీపీ ఐతా ఆనంద రాము, రాపేటి నాగేశ్వరరావు, సుంకర చంటి, బాదపు తాతారావు, యాదగిరి అప్పారావు, ఏపీ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జంపన శివాజీ వర్మ, పొలమరశెట్టి నర్సింగరావు, విసరపు నాయుడు, పెద్దాడ రామ్ శంకర్, నార పిన్ని ప్రసాద్, మొల్లి అప్పారావు, అంజలిన రాజశేఖర్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేపడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతలు



వెంకుపాలెంలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

**కశింకోట:** నరసింగబిల్లిలో శనివారం వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.



నరసింగబిల్లిలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం

**ఉత్తరాంధ్రలో నిరుద్యోగ సమస్యలపై దృష్టి సారిస్తా**

**అనకాపల్లిటౌన్:** ఉత్తరాంధ్రలో నిరుద్యోగ సమస్యలపై దృష్టి సారిస్తానని పట్టభద్రుల స్థానానికి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పోటీ చేస్తున్న గంటి రవికుమార్ అన్నారు. స్థానిక విజయారెసిడెన్సీలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్యోగాల కోసం వలసలు పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. బీజేపీ అభ్యర్థి గత దఫా గెలుపొందినప్పటికీ ఉత్తరాంధ్రకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. టీడీపీ ఉనికిని కాపాడుకోవడానికి తంటాలు పడుతుందని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేసే తనకు అవకాశం కల్పించాలని ఆయన అభ్యర్థించారు.

# టెన్త్ పరీక్షలపై శ్రద్ధ చూపండి

**అనకాపల్లిటౌన్ :** విద్య మనిషికి ప్రాణవాయువు వంటిదని మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పాఠశాల ఆవరణలో శనివారం తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు చాలా తక్కువసమయం ఉందని, ఈ సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అంతకుముందు ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో పదో తరగతి విద్యార్థుల ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు. సాంఘిక శాస్త్ర అధ్యాపకురాలు మోతిబాయ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితానికి పునాది అయిన 10వ తరగతి పరీక్షల్లో ఉన్నతమైన ఫలితాలు సాధించాలని సూచించారు. హిందీ అధ్యాపకుడు హమేంద్రనాథ్ పట్నాయక్ మాట్లాడుతూ తల్లి ప్రసవ వేదన, తండ్రి కష్టాన్ని తెలిసిన విద్యార్థి ఎవరూ కూడా విద్యను నిర్లక్ష్యం చేయరని, విద్య మాత్రమే పేదరికాన్ని జయిస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థి స్థిరపడేందుకు 10వ తరగతి పునాది వంటిదని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకుడు ధనుంజయకుమార్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నేడు జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి శిక్షణ కార్యక్రమం

**అనకాపల్లిటౌన్:** స్థానిక విజయారెసిడెన్సీలో ఆదివారం జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సంస్థ అనకాపల్లి పట్టణశాఖ కార్యదర్శి కోరిబిల్లి పరి శనివారం పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పరిరక్షణ సమితి చైర్మన్ టి.ఎన్. రామచంద్రనాయుడు, వైస్ చైర్మన్ మురళి హాజరవుతారని ఆయన తెలిపారు.

### రేపు కవయిత్రి మొల్ల జయంతి

**అనకాపల్లిటౌన్:** ఉమ్మడి విశాఖజిల్లాలో కుమ్మరి శాలివాహన కవయిత్రి మొల్ల జయంతిని ఈనెల 13న ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా కుమ్మరిశాలివాహన డైరెక్టర్ అర్జున వెంకటరావు శనివారం పేర్కొన్నారు.

# 12 నుంచి గ్లకోమా కంటి వైద్య శిబిరాలు

**తుమ్మపాల :** గ్లకోమా వ్యాధి నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ జి.వి.రమణ తెలిపారు. అంధత్వ నివారణ సంస్థ చైర్మన్, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఈ నెల 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 45 ఏళ్ల వయసు నుంచి రక్తపోటు, మధుమేహం ఉన్నవారు, వయోవృద్ధులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్లకోమా వ్యాధి నివారణ కేంద్రాలు, జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ద్వారా శాశ్వత అంధత్వం రాకుండా నివారించే అవకాశం ఉందన్నారు. పారా మెడికల్, ఆఫ్తాల్మిక్ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కంటి ఆస్పత్రుల వారితో కూడా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.





గ్లకోమా పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

# సీతంరాజుకు మద్దతుగా విస్తృత ప్రచారం

**అనకాపల్లి రూరల్ :** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెఎస్సార్‌సీపీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ నేతృత్వంలో పార్టీ నేతలు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలు వీధుల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలిచి సీతంరాజును గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని ఓటర్లకు నేతలంతా వివరించారు. భవిష్యత్‌లో విశాఖను పరిపాలన రాజధానిని చేయడంతో పాటు ఉత్తరాంధ్ర ఇండస్ట్రియల్ హబ్‌గా ఎదిగేందుకు సీతంరాజు గెలుపు దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టభద్రుల ఎన్నికల పేరుతో ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని,ఓటర్లంతా వాటిని తిప్పి కొట్టాలన్నారు. తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ సూర్యకుమారి, చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వడ్డాది భారతి అశోక్, పన్నీరు వెంకటలక్ష్మి, పన్నీరు చంటి, ఆర్టీసీ సత్యనారాయణ, గ్రామానికి చెందిన వెఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆడారి సూరిబాబు, పొలమరశెట్టి కృష్ణ, తత్ర సత్యారావు, నాగరాజు, కొయ్య జగదలక్ష్మి, కొయ్య భాస్కర్, వెలగా మోదునాయుడు, అనిల్, బంగారు రేవంత్, సంతోష్ కుమార్, ఆడారి ప్రసాద్ పాల్గొన్నారు.



తుమ్మపాలలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్

**'సీతంరాజు గెలుపు తథ్యం'**

**అనకాపల్లిటౌన్:** వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని ఆపార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో 83వ వార్డు పరిధిలో భీమునిగుమ్మం, నాగవంశంవీధి ప్రాంతాల్లో స్థానిక పార్టీ నేతలతో ఆయన శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్‌కు మొట్టమొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంక్షేమ పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సుధాకర్ గెలిపించి బహుమతిగా ఇవ్వాలని పట్టభద్రులను ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సమ్మంగి కనకారావు, మాజీ కౌన్సిలర్ లట్టాల మురళీకృష్ణ, బొండా శంకరరావు, కారుకుండి కన్నబాబు, బంగారి చంటి, రాజాబాబు, బుగతా అశోక్, సాయి పాల్గొన్నారు.

# ఘనంగా సర్పంచ్ జన్మదిన వేడుకలు



సర్పంచ్ పెంటయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న తుమ్మపాల యువకులు

**అనకాపల్లి రూరల్ :** తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వృత్తిపరంగా న్యాయవాది అయిన పెంటయ్యనాయుడు పలువురు పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన అనతి కాలంలోనే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూస్తూ ప్రజల మన్నన పొందుతున్నారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పలువురు మండల, స్థానిక నేతలు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక యువకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు కన్నారావు, వడ్డాది భారతి అశోక్, వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ చదరం చిన్నా, పన్నీరు చంటి, ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 20న ఎఫ్ఎం బాబాయ్‌కు సత్కారం

**మునగపాక:** మునగపాకలో ఈ నెల 20న గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రంగస్థల, సినీ నటుడు దాడి త్రినాథస్వామి (ఎఫ్ఎం బాబాయి)కు అభినందన సత్కారం జరుగుతుందని సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము ఒక ప్రకటనలో తెలిపారు. నందీశ్వర కళా ప్రాంగణంలో రాత్రి 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.125 సినిమాల్లో నటించి, 500కు పైగా కామెడీ షోలు, 25కు పైగా షార్ట్‌ఫిల్మ్స్, 200కు పైగా రంగస్థల ప్రదర్శనలు, 164 పరిషత్తుల్లో పాల్గొని 162 ఉత్తమ పాత్రధారిగా ప్రతిభ చూపిన త్రినాథస్వామిని సత్కరిస్తామన్నారు. అలాగే డాక్టర్ పి.సతీష్‌కుమార్ దర్శకత్వం, నిర్వహణ, నిర్మాణంలో నిర్మితమైన తెలుగు చలన చిత్రం దహనంలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన త్రినాథస్వామి సత్కార కార్యక్రమానికి కళాభిమానులు తరలి రావాలన్నారు. అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు చెందిన భూమిక థియేటర్ గ్రూప్ వారిచే బరిబత్తుల రాజు నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాము కోరారు.

# ఆనంద్‌కు చెంగల అభినందనలు

**నక్కపల్లి:** ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ను పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు అభినందించారు. శనివారం ఆనంద్‌ను యలమంచిలిలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించినట్లు చెంగల తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆడారి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆనంద్ పార్టీ అధినేత అప్పగించిన పదవికి న్యాయం చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



ఆనంద్‌ను అభినందిస్తున్న చెంగల

# వృద్ధాశ్రమానికి విద్యార్థుల వితరణ

**కశింకోట :** కశింకోటలోని సెయింట్ జాన్స్ విద్యార్థులు విశాఖలోని సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమానికి కిరాణా సామాన్లు, 50 ప్లాస్కులను శనివారం వితరణ చేశారు. టాలెంట్ ఎక్స్‌పోలో సేవా దృక్పథంతో నైపుణ్య ప్రదర్శన, ఫుడ్ కోర్టు ద్వారా సేకరించిన నగదుతో వీటిని అందజేశారు. వృద్ధుల జీవిత అనుభవాలను తెలుసుకొని టెన్త్ విద్యార్థులు వారిని ఆట పాటలతో అలరించి నూతనోత్సాహాన్ని నింపారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ విద్యార్థుల సేవా నిరతిని ప్రశంసించారు.



వృద్ధాశ్రమంలో వృద్ధుల జీవితానుభవాలు తెలుసుకుంటున్న కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు

# ఉపమాక వెంకన్నను దర్శించుకున్న భక్తులు



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

**నక్కపల్లి :** కల్యాణోత్సవాలు, రెండో శనివారం సెలవు దినం కావడంతో ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను స్వామివారి ఉత్సవమూర్తులను క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. మూలవిరాట్‌ను మెట్ల మార్గం గుండా దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో రద్దీ ఏర్పడింది. బేడా మండపం, ఆస్థాన మండపం, ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వేచి ఉంటూ స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా యాత్రికులు తిరునాళ్లలో సుగంధ ద్రవ్యాలు, స్టీలు, ఇత్తడి పాత్రలు కొనుగోళ్లు జరిపారు.

**శ్రీరాముని కళ్యాణానికి పెళ్లిరాట**

**పాయకరావుపేట :** ఈ నెల 30 వ తేదీన శ్రీ సీతారాముల కళ్యాణం (శ్రీరామనవమి) సందర్భంగా పట్టణంలో గల శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పెళ్లిరాట వేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వానరసేన బృందం శ్రీరాముని కళ్యాణానికి శనివారం ఉదయం పెండ్లి రాట వేసి శ్రీరామనవమి కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో పెండ్లి రాటను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వానరసేన సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు, జగతా శ్రీను, కొశిరెడ్డి నాగసూరి,కొశిరెడ్డి నర్సింహమూర్తి, కనకరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి





సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి సీఐ రవికుమార్

**కశింకోట :** రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అనకాపల్లి సీఐ ఎ.రవికుమార్ కోరారు. తాళ్లపాలెం వద్ద ఉన్న చిట్టినాడు సిమెంట్ పరిశ్రమ కార్మికులు, ఉద్యోగులతో శనివారం సాయంత్రం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సమావేశంలో నిర్వహించిన మాట్లాడారు. ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిశ్రమ ఏజీఎం నరసింహరాజు, ప్రతినిధులు ధనుంజయ్, చక్రపాణి, మేనేజర్ దిల్లీశ్వరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణంపై నేడు సమావేశం

**మునగపాక:** మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద అఖిలపక్ష సమావేశం జరుగుతుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

# 14న గంగ పరదేశమ్మ పండగ

**మునగపాక :** మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఈ నెల 14న గంగ పరదేశమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకోవాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పండగలను సమష్టిగా జరుపుకోవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత శేషు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కూడా పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



గంగ పరదేశమ్మ అమ్మవారి పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

### 'మహిళా ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం'



బస్సులో మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న దొరైస్వామి

**అచ్యుతాపురం(అనకాపల్లి) :** బ్రాండిక్స్ సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగులు వారి గమ్యస్థానాలను చేరుకునే వరకూ భద్రత, వసతులు కల్పిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి షిఫ్టులో విధులు ముగించుకొని ఇళ్లకు వెళుతున్న మహిళా ఉద్యోగుల సాధకబాధకాలు తెలుసుకునేందుకు ఆయన బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు, బస్సు డ్రైవర్లతో మాట్లాడి వారికి ఎదురయ్యే ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తమ సంస్థలోని ప్రతి ఉద్యోగికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడానికి ముందుంటామని అన్నారు.